# ❁ జయభేరి ❁

[పశ్చిమచాళుక్యచక్రవర్తియగు ఆఱవవిక్రమాదిత్యుడు కీ.శ. 1126 లో గతించ అతని కుమారుడు భూలోకమల్లుడు రాజయ్యెను. ఈమధ్యకాలమున కాకతిప్రోలరాజు ఆంధ్రరాజ్యము నెలకొల్పదలంచి పశ్చిమచాళుక్యసామంతరాజుల కొందరిని లోగొని విజయభేరి మ్రోగించి దండయాత్రకు బయలుదేరుట ఈనాటకకథయందలి యితివృత్తము. చరిత్రశోధనమున నిర్ణయులైన సమకాలికపురుషులే చాలవర కీ నాటకమునందు పాత్రములుగ జేర్పబడిరి. పశ్చిమచాళుక్య రాజ్యసంబంధులగు వీరులును కాకతీయ ప్రోలరాజు పక్షపువీరులును, బరస్పర జిగీషతో గావించిన సంగరముల దెలుపు వేయి స్తంభాల గుడిశాసనము మొదలగునవి ప్రకృతికథాకల్పనమున కాధారములు. కొండు భట్లు రామభద్రచయనులు రాజపురోహితుడు కథాకల్పన సౌష్ఠవమునకు సాయముగ గైకొన్న కల్పితపురుషులు. తక్కినవారందఱు చరిత్రలోకమున సుప్రసిద్ధులు. ఆఱవ విక్రమాదిత్యుని యంత్యావస్థతో కథాకల్పన మారంభింపబడి ప్రోలరాజు దండయాత్ర వెడలుటతో, యువరాజకుమారుని రాజ్యపట్టాభిషేకముతో ముగింపఁబడినది. కథాకాలము శా. శ. 1048 పరాభవ సం. భాద్రపద బ. దశమినుండి ఆశ్వయుజ శు. దశమివరకు నడచినట్లు భావింపబడినది.]

## నాటకమునందువచ్చు పాత్రలు

| | | | |
|---|---|---|---|
| 1 | ప్రోలరాజు | — | అనుమకొండరాజు |
| 2 | ముప్పమదేవి | — | ప్రోలరాజుభార్య |
| 3 | గంగాధరమంత్రి | — | ప్రోలరాజు అంతఃపురపరిపాలకమంత్రి |
| 4 | బేతనమంత్రి | — | ప్రోలరాజుప్రధాని |
| 5 | అచింతేంద్రుడు | — | రాజగురువు |
| 6 | కుమారరుద్రుడు | — | యువరాజు |
| 7 | కామచమూపతి | — | కాకతీయసేనాధ్యక్షుఁడు |
| 8 | సామంతబొల్లయ | — | ప్రోలరాజునకు సామంతుఁడు |
| 9 | కొండుభట్లు | — | అచింతేంద్రవరుని |
| 10 | రామభద్రచయనులు | — | శిష్యులు— |
| 11 | దేవణభట్టు | — | గూఢచారి |
| 12 | భూలోకమల్లుడు | — | పశ్చిమచాళుక్యచక్రవర్తి |
| 13 | మందెనగుండరాజు | — | పశ్చిమచాళుక్యచక్రవర్తుల |
| 14 | జగద్దేవమహారాజు | — | సామంతరాజులు |

రాజపురోహితుడు తదితరులును వత్తురు.

## మొదటియంకము — మొదటిరంగము

స్థలము—అనుమకొండకోట

కాలము—మొదటిదినము సాయంకాలము.

(కోటలోని రాజభవనమువైపు పోవుచు కాకతి ప్రోలరాజును అతని అంతఃపురపాలక మంత్రియగు గంగాధరమంత్రియు ప్రవేశించుచున్నారు.)

ప్రోలరాజు:—గంగాధరా! మన మంత్రిసత్తముడైన బేతనధార్మికబుద్ధి యెంతయు గొనియాడదగి యున్నది. అతని స్వామిభక్తికితోడు వినయసౌశీల్యాది సుగుణపుంజములనుజూచి మేమెంతయో హర్షితుల మగుచుందుము.

గంగాధరమంత్రి:—బేతనమంత్రిభార్య ప్రతిష్ఠించిన కడలాలయబసది (పద్మాక్షీదేవాలయము)నుండి ఇప్పుడే వేంచేయుచున్న దేవరవెంటనున్న నాకు బేతనమంత్రి సుగుణాతిశయము స్వానుభవసిద్ధమే యయ్యెను. అదిగాక దేవరకు ఆశ్రితులయెడగల గౌరవాదరములు ప్రత్యక్షముగా గనుగొనగలుగుచున్నాడను.

ప్రోలరాజు:—బేతనమంత్రియు అతని భార్యమైలమదేవియు మన యనుమకొండకోటయందు దేవతాప్రతిష్ఠ యొనర్చిరి. కాకతి రాజన్యపుంగవుల బాహుబల పరిరక్షణమునకుదోడు దైవబలంబుకూడ సహాయపడి అనుమకొండదుర్గమునకు భద్రము చేకూర్ప వలెనని యాపుణ్యదంపతుల యభీష్టమైయుండవొప్పు.

గంగాధరమంత్రి:—దేవరి యంతఃకరణప్రవృత్తి సత్యమును నిరూపింపకుండ నెట్లుండగలదు.

ప్రోలరాజు:—దేవతాసందర్శనాంతరము ఒకదివ్యసందేశము మాకన్నిదిక్కులనుండి వినవచ్చుచున్నట్లు స్ఫురించుచున్నది.

గంగాధరమంత్రి:—ఆశ్చర్యము! ఆశ్చర్యము!!

ప్రోలరాజు:—అదేమైయుండునో?

గంగాధరమంత్రి:—ఆ! గోచరించినది! గోచరించినది. దేవరదిగ్విజయయాత్రకు దోహదమొనరించు సువార్తయొకటి పంపించిన గూఢచారునివలన విననున్నారమేమో! సందేహమేల? ఆదివ్యసందేశము తప్పక దేవరదిగ్విజయ యాత్రవిషయమైయుండును.

ప్రోలరాజు:—బ్రాహ్మణవాక్య మమోఘమని పెద్దలందురుగదా!

గంగాధరమంత్రి:—మన మిదిగో రాజభవన సమీపమునకు వచ్చిచేరితిమి.

ప్రోలరాజు:—సూర్యాస్తమయ సమయమైనది కావున తత్కాలోచిత కృత్యంబులు నెరవేర్ప మేమంతర్భవనమునకు వెడలెదము. మీరును మీనైమిత్తిక కార్యములొనర్ప వెడలగలరు.

గంగాధరమంత్రి:—చిత్తము!

ప్రోలరాజు:—గంగాధరమంత్రీ! రాత్రి పురాణశ్రవణకాలంబున దేవతామందిర ప్రాంగణమున మమ్ము కలిసికొనుడు. (నిష్క్రమించును.)

(గంగాధరమంత్రియు వెడలిపోవును.)

## మొదటియంకము — రెండవరంగము

స్థలము-అచింత్రేంద్రవరుని ఆశ్రమము;

కాలము-రెండవదినము ఉదయము నాలుగుగడియల ప్రొద్దెక్కినతరువాత.

(కొండుభట్లు రామభద్రచయనులు అను నిద్దరు శిష్యులు ప్రవేశింతురు.)

కొండుభట్లు:—ఓరీ చయనులూ! యీ వేళ యింకా మనగురువుగారు ఆశ్రమానికి చేరకపోవుటకు యేమికారణమైవుంటుంది?

చయనులు:—ఇంకేముంటుంది? మహారాజుగారి దర్శనానికి వెళ్లివుంటే ఆలస్యమైవుంటుంది.

కొండుభట్లు:—మందబుద్ధిరానీది! నీవేమో మహా వూహగాడ వనుకున్నాను.

# గృహలక్ష్మి

## కంఠాభరణము

అమూల్యగ్రంథము! అపూర్వరచనము!

తొమ్మిది సంవత్సరములుగా ఆంధ్ర సోదర సోదరీమణుల యపూర్వాదరణ ప్రేమలనుభవించుచు విహరించు 'గృహలక్ష్మి' యందు ప్రకటితమగు మనోహరమైన త్రివర్ణచిత్రములనుగూర్చి వేరుగ జెప్పుటనవసరము. ఈ చిత్రములందు శ్రేష్ఠమైన నలువదియారు త్రివర్ణచిత్రములనేరి యొక్కొక్క చిత్రమునుగూర్చి వాడుకభాషలో ముద్దులుగులుకు వ్యాసములు శ్రీయుత వసుమర్తి కృష్ణమూర్తిగారిచే రచింపబడినవి. చిత్తరువుల గూర్చిన విషయములేగాక తదవకాశముల బురస్కరించుకొని గ్రంథకర్తగారు చక్కని నీతులను పుస్తకమంతయు గుప్పించియున్నారు. రచనావిధానమత్యంతరమణీయము. వాడుకభాషా సౌందర్యమిందే గననగును. శైలి మృదుమధురము. ఇందలి తియ్యదనమును చవిగొన్నవారొకమాటుతో తనియజాలరు.

గృహలక్ష్మి సైజున 200 పుటల గ్రంథము. ఫెదరువైటు కాగితములపై నచ్చొత్తింపబడినది. దివ్యమైన కాలికోబైండు.

ఈ గ్రంథము ప్రతిసోదరీమణియు జదువతగినది. బాలికాపాఠశాలలకును గ్రంథాలయములకును వన్నెదెచ్చు గ్రంథము. దీనినిగూర్చివ్రాసిన దానికంటె చదువరులెక్కువ దెలిసికొనగలరు.

వెల 2 రు. మాత్రము

## గృహలక్ష్మి కార్యాలయము

పోస్టుబాక్సు నెం. 752, ఎగ్మూరు, మద్రాసు.

**చయనులు**:—అన్నట్లు మరచిపోయినాను. రాజకీయ వ్యవహారాల్లో యేదో మనగురువుగారి సలహా కావలసివచ్చి మహారాజులుంగారు తక్షణంబయలుదేరి రమ్మన్నారని గంగాధరమంత్రి స్వయముగావచ్చి పిల్చుకొని పోయేడట! ఇట్లని మన ఆశ్రమసేవకుడొకడు దారిలో కనబడిచెప్పినాడు.

కొండుభట్లు:—అయితే నాకొక్కడికేకాకుండా నీకూడా చెప్పినాడన్నమాటే. సరేకాని — మన పట్నంలో సైన్యసన్నాహం యెక్కువగా జరగడం చూస్తే యేదోవిశేషం ఉండివుండాలని తోస్తోంది.

చయనులు:—నిస్సందేహంగా? ఏదో శుభవార్త మన గురువుగారివలన కాకపోతే మరియెవ్వరివలనైనా వినకుండా వుండములేండి.

కొండుభట్లు అయితే యీవేళ మనపాఠం అధ్యాహారమన్నట్టే!

చయనులు:—యేనుగులే కొట్టుకపోతూంటే ఇక దోమలా నిలిచేవి? చూడండీ! మనకెప్పుడైనా మహారాజుగారి దర్శనం లభిస్తుందా?

కొండుభట్లు:—దేవీనవరాత్రులు రానేవచ్చాయి. ఈసమయంలో యీఆశ్రమంలోనే మహారాజుగారి దర్శనం మనకు కాబోతుందని నాదివ్యదృష్టివల్ల కనుగొన్నానోయ్.

**చయనులు**:—తమ దివ్యదృష్టి కేంగానండి!— అథవా మనగురువుగారి యనుగ్రహమూ మన అదృష్టమూ వానింబట్టి వుంటుందిలెండి!

కొండుభట్లు:—ఇక యీవేళ మనం ఇండ్లకు పోదాం పద—(ముందుకు నడచును.)

**చయనులు**:—నేనూ వస్తున్నాను (కొండుభట్లు వెంటపోవును.) (అందరు నిష్క్రమింతురు.)

## మొదటియంకము—మూడవరంగము

స్థలము—అనుమకొండకోటలోని ఒకరాజభవనాంతర్గత రహస్యమందిరము. కాలము—పగలు రెండు ఝాముల వేళ రెండవదినము.

(ప్రోలరాజు సాదాబట్టల తొడుగుకొని ఉన్నతాసనముపై కూర్చుండియుండును. గూఢచారి యొకడు చేతులం జోడించుకొని నిలుచుండియుండును.)

ప్రోలరాజు:—నీవట్లు కల్యాణకటకంబునకుబోయి కనుగొన్న విశేషములేమి?

గూఢచారి:—దేవా! మీ యాజ్ఞానుసారము కళ్యాణనగరంబున కరిగి పశ్చిమచాళుక్య చక్రవర్తి యగు విక్రమాదిత్యుని రాజభవనమున జరుగు విశేషములెట్లు తెలిసికొనవలెనాయన్న ఆలోచన జేయుచుంటిని. అక్కడ నా మహాచక్రవర్తికి చాలజబ్బుచేసి శయ్యాగతుడై పడియున్నట్లు విన తటస్థించినది.

ప్రోలరాజు:—వృద్ధుడగు పశ్చిమచాళుక్యచక్రవర్తి యింకెంతకాలము జీవింపగలడు! తరువాత?

గూఢచారి:—ఆసంగతివిని నేనొకగొప్ప అపరధన్వంతరి యనదగిన వైద్యుడైనట్లును, చక్రవర్తిగారి మహాయశస్సువిని వారిదర్శనంచేసికొని నాస్వస్థలమగు వారణాశిపురంబునకు నేగ నుద్దేశించినట్లును అచ్చటి ప్రజలలో ఒకవదంతి వ్యాపింపజేసితిని.

ప్రోలరాజు:—ఓహో! గూఢచారి భావంబువదలి వైద్యశిరోమణివైతివిగా! తరువాత నీభేషజ మెట్లు మనపని కనుకూలించినది?

గూఢచారి:—దేవా! నా యీవార్త చక్రవర్తిగారి చెవిలోబడుట తడవుగా నే నా మహామహుని యెదుటకు జేర్పబడితిని.

ప్రోలరాజు:—అప్పటికా చక్రవర్తిగారి దేహారోగ్యమెట్లుండెను?

గూఢచారి:—నేడో, రేపో— (అనిముందుచెప్ప సందేహించును)

ప్రోలరాజు:—ఆమహా చక్రవర్తియందు మాకెంత గౌరవభావమున్నను వాస్తవమెరిగించుటకు సంకోచింపక గూఢచారివగు నీస్వధర్మము నెరవేర్పుము. మేమన్యథాభావింపము—కానిమ్ము.

గూఢచారి:—అట్టిస్థితిలో చక్రవర్తిగారు మూసి యుంచిన కన్నులు లొక్కించుక దెరచి నావైపుజూచి మఱల కన్నులుమూసుకొని యొకప్రక్కకు మరలిరి.

ప్రోలరాజు:—పాపము వారీ యపరధన్వంతరి మాట్లాడింపలేకపోయిరి కాబోలు ?

గూఢచారి:—అవును మహారాజా !

ప్రోలరాజు:—తరువాత యేమిజరిగెనో సంగ్రహముగాజెప్పి నీవచ్చినపని ముగించి వెడలుము.

గూఢచారి:—అంత రాజబంధువులు నన్ను చక్రవర్తిగారి నాడి పరీక్షించుమన్నారు, నేనట్లుచేసి వారి కోరికపై నా మందులసంచిలోనుండి యొకమందు కుప్పెనుదీసి దాని వరగదీసి చక్రవర్తిగారి నాలుకకు రాసితిని.

ప్రోలరాజు:—నీవు తప్పక అపరధన్వంతరివేయని చక్రవర్తిగారి బంధువులకు దృఢవిశ్వాసముగలిగించి యుందువు. కావున నీకు మహాచక్రవర్తిగారి దర్శనము పదేపదే జరిగియుండెనా ?

గూఢచారి:—లేదు, దేవా లేదు.

ప్రోలరాజు:—ఎందుచేత ?

గూఢచారి:—నేను తిన్నగా నూహించి చెప్పజాలనుగాని నేనిచ్చిన ఔషధము కొంతపనిచేసి చక్రవర్తిగారు కొన్ని అత్యవసరములగు రాజకీయములను గూర్చి మాట్లాడదలచి సామంతమండలేశ్వరులను దగ్గరకు పిలిపించుకొని వారివల్ల కొన్ని ముఖ్యసంగతులు తెలిసికొన్నారని వింటిని.

ప్రోలరాజు:—అవేమైయుండును.

గూఢచారి:—అట్లు చక్రవర్తిగారి యాజ్ఞానుసారముగా వారి శయ్యాగారముకడకు వచ్చినవారలలో గోవిందదండేశుడు కుమారతైలపదేవుడును తదితరులుండిరట !

ప్రోలరాజు:—అట్టివారిలో యువరాజు కుమారుడు లేడా ?

గూఢచారి:—క్షమింపుడు మహాదేవా ! చెప్ప మరచితిని. యువరాజుకుమారుడు తండ్రిగారిశయ్యను ఆనుకొని కూర్చుండియే వారి యభిప్రాయములను దండనాథాది రాజసేవకులకు వినుపించుచుండిరట !

ప్రోలరాజు:—అప్పుడు చక్రవర్తియడిగి తెలిసికొన్న ముఖ్యరాజకీయవిషయము లేమైయుండెనని వింటివి.

గూఢచారి:—అన్నిటిలోను మనకు సంబంధించిన ముఖ్యవార్తలు వినుపించుచున్నాడట— అక్కడచేరిన కుమారతైలపుడు గోవిందదండేశుడు కూడ దేవరచే నోడింపబడినట్లు చక్రవర్తికి తెలిసినప్పుడు ఆయనకు గలిగిన ఆగ్రహావిచారంబులు ఇంతంతని చెప్పనలవి కాదయ్యెనట.

ప్రోలరాజు:—వినవలసిన ముఖ్యవిషయము విని చక్రవర్తిచిత్తము తత్తరమందియుండును. తరువాత నేమిజరిగినది ?

గూఢచారి:—దీర్ఘవిచారమునుండి కొంత తెప్పిరిలి "మనసామంతలేశుడైన ఉదయావనీశుడు గోవింద దండేశునికి దోడ్పడి రాజద్రోహియగు కాకతి ప్రోలరాజును బంధించి మాకాళ్లముందట పడవేయలేకపోయెనా" అని యడిగినారట. ఆప్రశ్నకు గోవింద దండేశుడు—(అర్థోక్తిలో)

ప్రోలరాజు:—ఏమని ప్రత్యుత్తరమిచ్చినాడు ?

గూఢచారి:—"ఉదయావనీశుడు కూడ ప్రోలరాజున కోడిపోయి తానుపోగొట్టుకొన్న రాజ్యము మరల సంపాదించుకొనుటకు మనశత్రువుతో సఖ్యంబు పాటించి బ్రతుకుజీవుడాఅని పశ్చిమచాళుక్యసైన్యమును వీడి స్వదేశమునకు వెడలిపోయె"నని చెప్పినాడట !

ప్రోలరాజు:—ముఖ్యవార్త విని ఆ చక్రవర్తి ఎంతటి దురవస్థకుపాలయ్యెనో పాపము !

గూఢచారి:—ఆమాటలువిని చక్రవర్తి పిచ్చెక్కినవానివలె అఱచుచు, దేహముకంపింప పట్టరాని కోపమువచ్చి, ప్రోలరాజా! నీవెంతటి ద్రోహమున కొడిగట్టితివి? నీతండ్రి మాకాళ్లపైబడి సంపాదించి నీకిచ్చిపోయిన రాజ్యమనుభవించుచుగూడ మా కపచారమొనర్చుచుంటివా? సామంతులారా! మీరిప్పుడేపోయి ఆరాజద్రోహిని పట్టుకొనివచ్చి మా కాళ్లపైబడ వేయుడు—హా! దుర్భరము—ఎంతటి సామ్రాజ్యమున కిట్టియవస్థ వాటిల్లినదని యింకను నేమోదలచుకొని దుఃఖాతిశయమున అలసిపోయి యాక్షణముననే కన్నులుమూసెనట !

ప్రోలరాజు: —పశ్చిమచాళుక్య సూర్యుడు అస్తంగతుడయ్యెననుటకు సందేహింప బనియుండదు.

గూఢచారి: — దేవర యూహించినట్లే జరిగినది.

ప్రోలరాజు:—ఈ వార్తవిన్నమాకు దుఃఖహర్షము లొక్కసారిగా కలిగి భావోద్రేకముబుట్టుచున్నది. దేవణభట్టా! నీగూఢచారికృత్యంబు లెస్సగాజరిపితివి. పోయిరమ్ము (కూర్చుండిన స్థలమునుండి లేచి వెడలును.)

[గూఢచారి నిష్క్రమించును.]


# గృహలక్ష్మి

ఒక్కొక్కవత్సరపు పండ్రెండు సంచికలు కలిపి బైండుచేసిన సంపుటములు. కాలికోబైండు. దిట్టమైనఅట్ట. గ్రంథభాండాగారములకు అలంకారములు. ఒక్కొక్క సంపుటము కొద్ది కాపీలు మాత్రమే ఉన్నవి. కావున త్వరపడి ఆర్డరు చేయవలెను. ఆలసించిన దొరకనేరవు. తిరిగి అచ్చుపడనేరవు.

వెల సంపుటము ఒక్కటికి రు. 6—0—0 మాత్రము

రైల్వేపార్సెలుగా తెప్పించుకొనుట మంచిది.

గృహలక్ష్మీ కార్యాలయము,

పోస్టుబాక్సు నెం. 752, ఎగ్మూరు, మద్రాసు.